


బంగారు ఆభరణాలు వితరణ


చెరుకుపల్లి: గుళ్లపల్లిలోని రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు భక్తులు రూ.10.78 లక్షల విలువైన బంగారు ఆభరణాలు గురువారం అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 574.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,578 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తెలుగు మహాసభలకు ఆహ్వానం



కారెంపూడి: స్థానిక ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యా యుడు జి.మాన్‌సింగ్ నాయక్‌కు విజయవాడలో ఈ నెల 28,29 తేదీలలో జరగనున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు గురువారం ఆహ్వానం అందింది.

న్యూస్‌రీల్

నేడు ఎస్‌ఎంసీ కార్యకలాపాలపై శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ కార్యకలాపాలపై జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు గుంటూరు చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష జిల్లా అదనపు సమన్వయకర్త జి.విజయలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల రీసోర్స్ పర్సన్లకు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ముందుగా పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. వేదిక మార్పుపై ఉపాధ్యాయులకు, ఎస్‌ఎంసీ సభ్యులకు చెప్పాలని ఎంఈవోలకు, హెచ్‌ఎంలకు సూచించారు.

కొండవీటి వాగు ఆధునికీకరణకు ఏర్పాట్లు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం నుంచి వాగు పొడవునా సీఆర్‌డీఏ అధికారులు విస్తరణ, ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు సన్నాహాలు ప్రారంభించారు. అందులో భాగంగా గురువారం ఉండవల్లిలో పలుచోట్ల మార్కింగ్ చేశారు. వాగు వెంబడి 350 అడుగుల వరకు స్థలాన్ని సేకరించనున్నారు. కుడి, ఎడమ వైపుల 30 అడుగులు చొప్పున విస్తరించాలని నిర్ణయించారు. వాగు నుంచి ఉండవల్లి అమరాతి రోడ్డు వైపు దాదాపు 250 అడుగుల వరకు భూమి సేకరించాల్సి వస్తోంది. కొలతలు వేసిన ఉండవల్లిలో గుంటూరు చానల్ – ఆంజనేయస్వామి గుడి వరకు వాగు వెంబడి చాలా నివాసాలు తొలగించాల్సి వస్తోంది. భూమికి బదులు భూమి, చదరపు గజానికి రూ.5 వేలు వంతున ఇస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఉండవల్లి అమరావతి రోడ్డు పక్కనే ఉన్న దేవస్థానం భూముల్లో ఈ కేటాయింపులు ఉంటాయని అంటున్నారు.

ఎమ్మెల్యే సోదరుడినంటూ ఉద్యోగాలిప్పిస్తానని మోసం

లక్ష్మీపురం: తెలుగు దేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోదరుడినని, మరికొంత మంది వద్ద ఎమ్మెల్యే పీఏనని చెబుతూ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ భారీ మొత్తంలో నగదు తీసుకుని బెదిరింపులకు దిగుతున్న వ్యక్తిపై గురువారం రాత్రి కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుజ్జనగుండ్ల మసీదు సెంటర్ ప్రాంతానికి చెందిన షేక్ మహమ్మద్ ఆరీఫ్ ఇంటిలో గతంలో తురకపాలెం రోడ్డు స్తంభాలగరువు ప్రాంతానికి చెందిన గోరంట్ల మాలకొండయ్య అద్దెకు ఉండేవాడు. ఆ పరిచయంతో ఆరీఫ్ తల్లి వద్ద విడతలవారీగా రూ.18 లక్షలు తీసుకున్నాడు. నగదు ఇవ్వాలని అడిగితే 6 నెలల్లో ఇస్తానని చెప్పాడు. దీంతో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రావడంతో పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యురాలు గళ్ళా మాధవి తన అక్క అని, ఆమెతో మాట్లాడి అవసరం అయితే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో కొన్ని రోజుల తరువాత ఆరీఫ్ ఫోన్ చేసి డబ్బు గురించి అడిగారు. మళ్లీ ఫోన్ చేస్తే హతమారుస్తానని బెదిరించసాగాడు. బాధితుడు ఆరా తీయగా తుపాన్ నగర్‌కు చెందిన షేక్ నజీర్ అనే వ్యక్తికి కూడా మాల కొండయ్య గతంలో తాను ఎమ్మెల్యే పీఏనని చెప్పినట్లు వెల్లడైంది. జిల్లా పరిషత్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు తీసుకున్నాడని తెలిసింది. ఇలా అనేక మందిని మోసం చేశాడని, డబ్బు వెనక్కి అడిగిన వారిని బెదిరిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో బాధితుడు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

31న యల్లమందలో సీఎం పర్యటన

నరసరావుపేట రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 31న ముఖ్యమంత్రి ఎస్.చంద్రబాబునాయుడు నరసరావుపేట రూరల్ మండలంలోని యల్లమంద గ్రామంలో పర్యటించనున్నారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేలు గురువారం యల్లమందలో పర్యటించి స్థల పరిశీలన చేశారు. సభకు అనువైన స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని ప్రకటించిన తరువాత జిల్లాలో రెండు గ్రామాలను అధికారులు పరిశీలించారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో రాజ్యసభ మాజీ సభ్యుడు యలమంచిలి శివాజీ

ఆర్నెల్ల షోకు.. ప్రజలకు షాకు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవకాశం ఉంటే తగ్గించడానికి ప్రయత్నిస్తామని ప్రచారానికి వెళ్లిన ప్రతీ చోటా చంద్రబాబు పదే పదే చెప్పారు. తీరా కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే ప్రజలకు రెండు సార్లు షాక్ ఇచ్చారు. ప్రజలకు చేసిందేమీ లేకపోయినా .. అవకాశం దొరికితే చాలు ఏదో చేసేశామనే షో ఎక్కువైపోయింది. రాష్ట్రం మొత్తం మీద నవంబర్ మాసంలో రూ.6,072.86 కోట్లు, డిసెంబర్ నెలలో మరో రూ.9,412.50 కోట్లు కలిపి మొత్తం రూ.15,485.36 కోట్ల వరకు ప్రజలపై భారం మోపారు. దీంతో ఎన్నికలకు ముందు చంద్రబాబు చెప్పింది బూటకపు మాటలేనని మరోమారు స్పష్టమైంది.

- ఎన్నికలకు ముందు చంద్రబాబు అడ్డగోలు హామీలు
- వీలైతే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామంటూ బూటకపు మాటలు
- అధికారంలోకి వచ్చాక ప్రజలపై చార్జీల పెంపు పిడుగు
- యూనిట్‌పై అదనంగా రూపాయి వరకు వసూలు
- ఇంధనం, విద్యుత్ కొనుగోలు పేరిట భారీగా వడ్డన

కూటమి ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు బెంబేలు


సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన ష్యూరిటీ బోగస్ అని, బాదుడు మాత్రం గ్యారెంటీ అని ప్రజలు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొన్ని సాంకేతిక కారణాలతో అరకొరగా పెంచిన విద్యుత్ చార్జీలను భూతద్దంలో చూపిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రజలపై రూ.వేల కోట్ల భారాన్ని మోపారు. గతంలో వచ్చిన విద్యుత్ బిల్లులను, కూటమి ప్రభుత్వంలో ఇస్తున్న బిల్లులను చూసి ప్రజలు హడలిపోతున్నారు. గతంలో రూ.300 బిల్లు వస్తే ఇప్పుడు రూ.375 వరకు వస్తోంది. పది శాతానిపైగా బిల్లులు అదనంగా వస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు పేరిట భారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇస్తున్న విద్యుత్ బిల్లుల్లో ఎఫ్‌పీపీసీఏ చార్జీలు అని చేర్చారు. అంటే ఇంధనం, విద్యుత్ కొనుగోలు ధరల సర్దుబాటు చార్జీలు అన్నమాట. ఈ పేరుతో ప్రభుత్వం ప్రజలపై అదనపు చార్జీల ముసుగు దెబ్బ వేసింది. గత ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం పడకూడదనే లక్ష్యంతో ఇంధనం, విద్యుత్ కొనుగోలు చార్జీలను విధించకుండా బిల్లులు జారీ చేసేది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకే కాక పరిశ్రమల నిర్వాహకులకు కూడా బిల్లులు చెల్లించడం పెద్ద కష్టంగా అనిపించేది కాదు. గత ప్రభుత్వానికి భారం కాని కొనుగోలు చార్జీలు ఈ సర్కారుకు భారమైపోయాయా? అనే ప్రశ్న వినిపిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మినహాయించిన చార్జీలను కూడా కూటమి ప్రభుత్వం వసూలు చేస్తోంది. ప్రస్తుతం వస్తున్న బిల్లుల్లో 2022–23 సంవత్సరానికి సంబంధించి కొనుగోలు చార్జీల నిమిత్తం యూనిట్‌కు 58 పైసలు, తాజా 2024–25 సంవత్సరానికి సంబంధించిన కొనుగోలు చార్జీల నిమిత్తం యూనిట్‌కు మరో 40 పైసలను బిల్లులో కలిపి జారీ చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట..

విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం పోరుబాట పట్టనుంది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు అక్కడి ప్రజలను కలుపుకొని ఆందోళనలు నిర్వహించనున్నారు.



అడ్డగోలుగా అదనపు భారం

చిన్న రేకుల ఇంట్లో జీవనం సాగించే మా ఇంటికి ప్రతి నెలా తక్కువ మొత్తంలో విద్యుత్ వినియోగం ఉంటుంది. ప్రస్తుతం వస్తున్న బిల్లులు షాక్ కొడుతున్నాయి. ప్రతి నెలా కరెంటు బిల్లు వస్తుందంటేనే భయమేస్తోంది. గతంలో రూ.200, 250 వచ్చిన విద్యుత్ బిల్లు ప్రస్తుతం రూ. 700కు పైగా వస్తోంది. గత నవంబర్ నెలలో 151 యూనిట్లు వాడితే రూ.766 బిల్లు వచ్చింది. ఈ నెల 122 యూనిట్ల వాడకానికే రూ. 702 బిల్లు వేశారు. బిల్లు చార్జీ రూ. 400 అయితే ఫిక్స్‌డ్ చార్జీ రూ.10, కస్టమర్ చార్జీ రూ.45, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.7.32 పైసలు, సర్ చార్జీ రూ.25, ట్రూఅప్ రూ. 66.26, ఎఫ్‌పీపీసీఏ చార్జీ(04–22)కు రూ.84.64, ఎఫ్‌పీపీసీఏ చార్జీ (10–24)కు రూ.60.40లు... ఇలా అనేక చార్జీలు కలపడంతో అదనపు భారం పడింది.

– షేక్ సలీం, పాత గుంటూరు

తలచుకుంటేనే ఆందోళనగా ఉంది



నేను కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాను. మా లాంటి నిరుపేద కుటుంబాలకు స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమర్చడం సరికాదు. పాత మీటర్లు తొలగించి మరీ కొత్తది మా ఇంటికి అమర్చారు. దీనికి మా నుంచి ఎంత మొత్తం వసూలు చేస్తారో.. విద్యుత్ బిల్లు మున్ముందు ఎంత వస్తుందోననే ఆందోళనతో ఉన్నాం. పేదలపై ఇలా భారం వేయడం సరికాదు.

– యజిలీ సత్యవేదం, పుచ్చలపల్లి సుందరయ్యనగర్

యూనిట్‌పై అదనంగా రూపాయి వసూలు...

వినియోగించిన విద్యుత్‌కు సంబంధం లేకుండా యూనిట్‌కు సుమారు రూపాయి వరకు అదనంగా ప్రభుత్వం వసూలు చేస్తోంది. మామూలుగా ఇన్ని యూనిట్లకు ఒక రేటు, అవి పెరిగితే మరో రేటు ఉండే యూనిట్ ధర శ్లాబు విధానంతో పని లేకుండా ఎన్ని యూనిట్లు వాడినా అన్నింటికీ అదనంగా పెంచిన చార్జీలు చెల్లించాల్సిందే. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారం పడుతోంది. తక్కువలో తక్కువగా చూసినా ఈ రోజుల్లో సుమారు 150 యూనిట్ల విద్యుత్ వినియోగం సాధారణమై పోయింది. ఇంత వినియోగిస్తే శ్లాబు ప్రకారం బిల్లు ఎంత వచ్చినా.. దానికి అదనంగా మరో రూ.150 చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్ బిల్లుల ఎగవేతదారుల వల్ల కలిగిన నష్టాన్ని కూడా పేద, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లులు పెట్టి భర్తీ చేసుకునేలా ప్రభుత్వం అడుగులు వేసింది.



పిడికిలెత్తిన విద్యుదావేశం

జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలకు భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు పిలుపు

నేడు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరుబాట



పట్నంబజారు: ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి, వారిపై విద్యుత్ చార్జీల పేరిట పెనుభారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా శుక్రవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలను దిగ్విజయం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్‌లతో సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వంపై పెరిగిన వ్యతిరేకత

ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్ సీపీ చేపట్టిన ధర్నా కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కూటమి సర్కార్ అమలు చేయలేదన్నారు. పైగా విద్యుత్తు చార్జీల ద్వారా సుమారుగా రూ. 16 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. కేసుల భయం ఏ ఒక్కరికీ అవసరం లేదని, వైఎస్సార్ సీపీ ప్రతి ఒక్క బాధితుడి పక్షాన న్యాయపోరాటం చేస్తుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని, కచ్చితంగా వ్యతిరేకత ఉవ్వెత్తున ఎగసిపడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ప్రజల కోసం ఉద్యమిద్దాం: మేయర్

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రజల కోసం వైఎస్సార్ సీపీ ఎంతటి పోరాటానికైనా వెనుకాడదన్న విషయాన్ని తెలియజెప్పాలన్నారు. పెద్ద ఎత్తున వ్యాపార, వాణిజ్య, పేద, మధ్యతరగతి వర్గాలు తరలివచ్చి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్పొరేటర్లు మామిడి రాము, బత్తుల దేవా, నూనె ఉమామహేశ్వరరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, మార్కెట్‌బాబు, గేదెల రమేష్, జీకే, బూసి రాజలత, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, సైదాఖాన్, వంగల వలీవీరారెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, సత్యవతి, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

నియోజకవర్గాలవారీగా ఏర్పాట్లు..

- గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి గుజ్జనగుండ్ల సెంటర్ సమీపంలోని పలకలూరు రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్, తూర్పు నియోజకవర్గంలో పొన్నూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని అంబటి పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, వినియోగదారులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.
- గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పొన్నూరు రోడ్డులోని విద్యుత్‌భవన్ వద్ద నిరసన చేపట్టనున్నారు.
- తెనాలి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త అన్నాబత్తుని శివ కుమార్ చెంచుపేటలోని విద్యుత్తు డీఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.
- మంగళగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కార్యక్రమం జరగనుంది.
- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ నేతృత్వంలో ప్రత్తిపాడులోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేయనున్నారు. అన్ని మండలాల నుండి పార్టీ శ్రేణులు భారీగా తరలిరానున్నారు. ఇప్పటికే అన్ని మండలాల నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు.
- పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) ఆధ్వర్యంలో తాడికొండ అడ్డరోడ్డు వద్ద ఉన్న సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేనున్నారు.
- పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పొన్నూరు పట్టణంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, ప్రభుత్వ తీరును ఎండగట్టనున్నారు. అనంతరం విద్యుత్తు శాఖ అధికారులకు వినతిపత్రం అందించనున్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు 30 నుంచి దేహదారుఢ్య పరీక్షలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

నగరంపాలెం: పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఈ పరీక్షలు గుంటూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా ఎస్పీ ఏర్పాట్లు పరిశీలించారు. 1600 మీటర్లు, 100 మీటర్లు పరుగుపందెం , లాంగ్ జంప్ వంటి పరీక్షల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. అభ్యర్థులు మైదానంలోకి ప్రవేశించిన దగ్గర్నుంచి దేహదారుఢ్య పరీక్షలు ముగిసే వరకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన, ఛాతీ, ఎత్తు, కొలతలు పర్యవేక్షించే సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. జిల్లా ఏఎస్పీలు జీవీ రమణ మూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్), కె.సుప్రజ (క్రైం), ఏఓ ఎ.వెంకటేశ్వరరావు, డీఎస్పీలు బి.సీ తారామయ్య (ఎస్‌బీ), అజీజ్ (తూర్పు) పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాలబాలికల జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం ఉదయం 11 గంటలకు బీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగిన భవానీల రద్దీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ మహోత్సవాలు ముగిసినప్పటికీ గురువారం భవానీలు, భక్తుల రద్దీ కొనసాగింది. బుధవారం రాత్రి నుంచి గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న భవానీలు గురువారం తెల్లవారుజామున క్యూలైన్లలో చేరుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారికి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం భవానీలను దర్శనానికి అనుమతించారు. గురువారం ఉదయం కూడా గిరి ప్రదక్షిణ మార్గంలో భవానీల రద్దీ కనిపించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలను నిలిపివేయడంతో రద్దీ కొంత పెరిగింది. మహా నివేదన అనంతరం భక్తుల దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. భవానీలు మహా మండపం దిగువన ఇరుముడులు, హోమగుండాల్లో నేతి కొబ్బరి కాయలను సమర్పించారు. మహా మండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించడంతో పాటు కనకదుర్గనగర్‌లో లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేశారు.



దీక్ష విరమిస్తున్న భవానీ మాలధారులు

నేటి నుంచి యథాతథంగా ఆర్జిత సేవలు

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం నుంచి అన్ని ఆర్జిత సేవలు యథాతథంగా కొనసాగుతాయి. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద ఖడ్గ మాలార్చన, ఆలయ ప్రాంగణంలో లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాలను నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారికి జరిగే పంచహారతుల సేవనూ భక్తులు తిలకించవచ్చు. ఆయా ఆర్జిత సేవల టికెట్లను ఆన్‌లైన్‌తో పాటు దేవస్థాన ఆర్జిత సేవా కౌంటర్లలో పొందవచ్చు. భవానీ దీక్ష విరమణ మహోత్సవాలలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, ముడుపులు, మొక్కుబడులను సోమ, మంగళవారాల్లో లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు.



క్లుప్తంగా

సుబ్రహ్మణ్యం కార్యదక్షత నేటి తరానికి ఆదర్శం



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం 73వ జన్మదిన వేడుకలు గురువారం ఫ్యాక్టరీ ఆవరణలో కార్మికులు, కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. రవాణాశాఖ, తెనాలి ఇన్‌స్పెక్టర్ రాఘవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలో చేతిపంపుల నుంచి మోటార్ల ఉత్పత్తి కర్మాగారాన్ని నెలకొల్పి స్వయంకృషితో ఎదిగిన సుబ్రహ్మణ్యం కార్యదక్షత, పట్టుదల నేటితరానికి ఆదర్శమని ఆయన అన్నారు. సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ.. కొత్త సుబ్రహ్మణ్యం కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారని అభినందించారు. అంచే రామ్‌చంద్, ఆలపాటి వెంకట్రామయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. కుమారులు శ్రీనివాసకుమార్, కృష్ణకుమార్, హరికుమార్, శేషుకుమార్ పర్యవేక్షించారు. మానవత సంస్థ రీజినల్ చైర్మన్ కూడా అయిన సుబ్రహ్మణ్యాన్ని ఆ సంస్థ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

యార్డులో 53,545 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 49,089 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 53,545 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 7,500 నుంచి రూ. 13,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.10,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 47,637 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

పేదల పక్షపాతి వీఎం రంగా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు



వంగవీటి మోహనరంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంబటి రాంబాబు తదితరులు

పట్నంబజారు: పేద పక్షపాతిగా తుది శ్వాస వరకు పోరాడిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు కీర్తించారు. గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని పురస్కరించుకుని బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ.. పెత్తందారుల గుండెల్లో సింహ స్వప్నమై.. బలహీన వర్గాల అభ్యున్నతికి తన ప్రాణాన్ని సైతం లెక్కచేయని ధీరుడు మోహనరంగా అని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన జీవితాంతం పాటుపడ్డారన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ.. తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసమే పాటుపడిన మహనీయుడు వంగవీటి అని కీర్తించారు. చరిత్రలో ఆయనకున్న పేరును, ప్రజల మనస్సుల్లో ఉన్న గొప్ప స్థానాన్ని ఎవ్వరూ చెరపలేరన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు మామిడి రాము, ముంతాజ్, బత్తుల దేవా, నూనె ఉమామహేశ్వర రెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అచ్చాల వెంకటరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, మార్కెట్‌బాబు, గేదెల రమేష్, జీకే, బూసి రాజలత, సైదాఖాన్, వంగల వలీవీరారెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, సత్యవతి, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణకు పోరాటాలే శరణ్యం

సీపీఐ శత వార్షికోత్సవ సభలో రామకృష్ణ



ర్యాలీలో నినాదాలు చేస్తున్న కె.రామకృష్ణ, జంగాల అజయ్‌కుమార్ తదితరులు

లక్ష్మీపురం: రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి పోరాటాలకు మళ్లీ సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, సమ సమాజ స్థాపనకు ఉద్యమించడంతోపాటు త్యాగాలకూ సిద్ధంగా ఉండాలన్నారు. గాంధీ పార్క్ వద్ద గురువారం సీపీఐ శత వార్షికోత్సవ బహిరంగ సభ పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. ముందుగా బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి గాంధీ పార్క్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. దారి పొడవునా నృత్యాలు, కోలాటం ప్రదర్శిస్తూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సమరయోధులు అంటే గౌరవం, రాజ్యాంగంపై విశ్వాసం లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను సైతం అవమానిస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తెచ్చి లబ్ధి పొందుతోందని దుయ్యబట్టారు. దేశంలో సోషలిస్టు సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సమాయత్తం కావాల్సిన అవసరం ఉందని అన్నారు. భూ సంస్కరణల చట్టం తీసుకురావడంలో సీపీఐ పోరాటాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసే కుట్ర దేశంలో జరుగుతోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగురి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ.. దేశంలో నేడు పేదరికం, నిరుద్యోగం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే సవాళ్లను మరింత దీటుగా ఎదుర్కోవటానికి ఈ వార్షికోత్సవాలు వేదిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురు సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. సభలో నగర నాయకులు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి జూడో పోటీలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా శుక్రవారం నుంచి జూడో సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ అధ్యక్షుడు గణేష్ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎన్. పవన్ సందీప్, సీఈవో వెంకట్ నామిశెట్టిలు గురువారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. సీనియర్ కాడెడ్ సబ్ జూనియర్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్, గౌరవ అతిథిగా శాప్ చైర్మన్ ఎ. రవి నాయుడు, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.ఎస్.గిరీష తదితరులు హాజరవుతారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, గుంటూరు డీఎస్‌డీఓ పి. నరసింహారెడ్డి తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

రేపటి నుంచి బాలోత్సవం రెండో పిల్లల పండుగ

నరసరావుపేటటౌన్: ఈ నెల 28, 29 తేదీలలో పల్నాడు బాలోత్సవం రెండో పిల్లల పండుగ జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు పీ ఎస్ సీ అండ్ కే ఆర్ కళాశాలలో జరగనున్నాయని పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు గురువారం తెలిపారు. జిల్లాలోని 200 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి పదివేల మంది పైగా విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. మొదటి రోజు కార్యక్రమానికి ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు హాజరవుతారని పేర్కొన్నారు. 65 అంశాలలో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాన్ని పల్నాడు బాలోత్సవం కమిటీ గౌరవాధ్యక్షులు ప్రసాద్, అధ్యక్షుడు చిలకల రాజ గోపాలరెడ్డి, కోశాధికారి కోయ రామారావు, టెక్స్ట్ బుక్ రైటర్ షేక్ మహమ్మద్ గౌస్ తదితరులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

రేపటి నుంచి జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలు

- 15 రాష్ట్రాల నుంచి 350 మంది క్రీడాకారులు రాక
- సీనియర్ జాతీయ జట్లకు కే-రిడ్జిలో క్యాంప్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 31 వరకు గుంటూరురోడ్డు కే-రిడ్జి పాఠశాలలో 18వ జాతీయస్థాయి అండర్–17, అండర్–12 బాల బాలికల ఫ్లోర్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.జె.జోసఫ్ తెలిపారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ (ఐఎన్ఎఫ్ఎఫ్) మార్గదర్శకంలో ఈపోటీలను నిర్వహించటంతో పాటు అంతర్జాతీయ పోటీలలో పాల్గొనే జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు వివరించారు. దేశ వ్యాప్తంగా 17 జట్లు పోటీలో పాల్గొనేందుకు వస్తున్నట్టు తెలిపారు. పోటీలను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 350మంది క్రీడాకారులు, అఫీషియల్స్ పోటీలకు హాజరవుతారని తెలిపారు. పోటీల నుంచి ఎంపిక చేసిన జట్టు మలేషియాలో జరగనున్న అంతర్జాతీయ ఫ్లోర్ బాల్ టోర్నమెంట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. కాగా ఇప్పటికే హర్యానలో నిర్వహించిన పోటీలో పురుషులు, మహిళల సీనియర్ జట్లును ఎంపిక చేశారని తెలిపారు. సీనియర్ జట్టుకు తమ పాఠశాల క్రీడామైదానంలోనే ఐదు రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అవయవ దానంతో పునర్జన్మ

- బాడీ డొనేషన్‌కు ముందుకొచ్చిన 58 వేల మంది
- 3న అవయవ దానంపై గుంటూరులో మహాసభ
- అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు సీతామహాలక్ష్మి



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, గూడూరు సీతామహాలక్ష్మి

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి మరణించినా ఎనిమిది మందికి జీవితాన్ని ప్రసాదించి, వారిలో జీవించవచ్చని అఖిల భారత శరీర అవయవదాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి చెప్పారు. గురువారం గుంటూరు జీజీహెచ్‌లో అవయవదానంపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్‌ను ఆమె గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్, శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ యశస్వి రమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా దేశంలో అవయవదానంపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ ట్రస్టు పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం కిడ్నీ, లివర్ దానం చేసేందుకు ముందుకు వస్తున్న లైవ్ డోనర్లకు ప్రోత్సాహకంగా రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అవయవ స్వీకర్తలకు రూ. 15 వేలు ప్రభుత్వం ఇస్తోందని, దాతలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైవ్ డోనర్స్ అయిన తమ ఉద్యోగులకు కేంద్రం 42 రోజుల స్పెషల్ లీవ్ ఇస్తూ జీవో జారీ చేసినట్లు వెల్లడించారు. రైల్వే శాఖలో ఈ జీవో ఇచ్చిందని, దీని ద్వారా దాతలు విశ్రాంతి తీసుకుని తిరిగి విధులకు హాజరు కావొచ్చని అన్నారు. ఇదే తరహా రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ చూపాలని కోరారు. అవయవ దానంపై పని చేసేందుకు 2013లో జీవన్‌దాన్ ట్రస్టు ప్రత్యేకంగా ఏర్పడినట్లు తెలిపారు. ఈ ట్రస్టులో 978 మంది అవయవ దాతలు పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. తద్వారా అనేక మందికి నూతన జీవితాలను ప్రసాదించారన్నారు. దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల్లో అవయవ దానంపై ట్రస్టు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ, తెలంగాణలో 58 వేల మంది తమ శరీర దానానికి ముందుకు వచ్చి తమకు అనుమతి పత్రాలు అందజేశారన్నారు.

డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ.. కేంద్రం పరిధిలోని వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుంటే ఐదు నిమిషాల వ్యవధిలోనే ఆర్గాన్ డోనర్ కార్డు వస్తుందన్నారు. సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా సంఘం ఐదో మహాసభను గుంటూరులో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనవరి 3న గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో జరిగే ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కె.సత్యకుమార్, విశిష్ట అతిథిగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు విచ్చేయనున్నట్లు వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్‌లో నాలుగు గుండె మార్పిడి ఆపరేషన్లు చేసి రికార్డు సృష్టించిన ప్రముఖ నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలేకు సావిత్రిబాయి పూలే జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



హయగ్రీవ పూజలో పాల్గొన్న విద్యార్థులు



హోమం నిర్వహిస్తున్న చిన్న జీయర్ స్వామి

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా 11వ పాశురాన్ని గురువారం భక్తులకు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వివరించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. ఈ మహోత్సవాలలో భాగంగా జగ్గయ్యపేట, గుంటూరు, మంగళగిరి ప్రాంతాల నుంచి సుమారు 400 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారని తెలిపారు. అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్టి, మంగళాశాసనాలతో కార్యక్రమం వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం హయగ్రీవ పూజ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.

సమ్మెకాల ఒప్పందాలను అమలు చేయాలి


పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు

నరసరావుపేట: గతేడాది డిసెంబర్ 26 నుంచి 17 రోజులపాటు చేసిన సమ్మె సందర్భంగా కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలకు ప్రభుత్వం వెంటనే జీఓలు ఇచ్చి అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియు) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిలార్ మసూద్ మాట్లాడుతూ సమ్మె కాలంలో ఒప్పందాలు చేసుకొని ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కార్మికులు యోహాను, జీవరత్నం, చిన్న అల్లాబక్షు, సోమశేఖర్, నాగయ్య, జి.రమణ పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి చోరీ కేసులో నిందితుల అరెస్టు



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కంకిపాడు: నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనాలు, విల్లాలు, సోలార్ ప్లాంట్లు లక్ష్యంగా రాగి వైర్లు, ఎలక్ట్రికల్ తీగలు, ఇత్తడి ప్లంబింగ్ సామగ్రి చోరీ చేసిన ముఠాను కంకిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు స్థానిక పీఎస్‌లో గురువారం గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరి పరిధి గ్రామం గండాలయపేటకు చెందిన మేకల గోపి, తుమ్మ యెర్రకాటయ్య, మేకల జానీ, కృష్ణా జిల్లా మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన పొట్లూరి మల్లేశ్వరరావు విలాసాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. బంధువులైన వీరు, మరో నలుగురు వ్యక్తులతో ముఠాగా ఏర్పడ్డారు. విజయవాడ–మచిలీపట్నం హైవేకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లు, విల్లాలు, సోలార్ ప్లాంట్లు వద్ద సామగ్రిని చోరీ చేయటం మొదలుపెట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి, కృష్ణా జిల్లా కంకిపాడులో మూడు, పెనమలూరు – ఒకటి, పామర్రు– రెండు, మచిలీపట్నం–1 స్టేషన్‌ల పరిధిలో ఈ చోరీ కేసులు నమోదయ్యాయి. కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం దర్యాప్తు ముమ్మరం చేసింది. జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలో ఈడుపుగల్లు పరిధిలోని చైతన్య విద్యాసంస్థల సమీపంలోని ఖాళీ ప్లాట్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గుర్తించి, గురువారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వాస్తవలు తెలిశాయి. వారి నుంచి రూ.11 లక్షల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మేకల గోపి, తుమ్మ యెర్ర కాటయ్య, పొట్లూరి మల్లేశ్వరరావు, మేకల జానీలను అరెస్టు చేశారు. మరో నలుగురి కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసు విచారణలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ జె.మురళీకృష్ణ, ఎస్ఐ డి.సందీప్ బృందానికి రివార్డులు అందించి, అభినందించారు.

అన్నన్న..! కాలం చెల్లిన నైతికత

వరుసలు మరిచిన వివాహ బంధాన ఏడడుగులు తడబడుతున్నాయి. ముడిపడిన మూడు ముళ్లు.. సంప్రదాయాలకు ఉరి తాళ్లు బిగిస్తున్నాయి. ఒంటెద్దు పోకడలతో ఒక్కటైన జంటలను చూసి పెళ్లి బాజాలు మూగబోతున్నాయి. మరో వైపు ఆస్తుల అత్యాశతో తోడబుట్టిన బంధాలు నెత్తుటి కత్తులు దూస్తున్నాయి. పాశ్చాత్య పోకడల్లో, పైశాచికపు ఆలోచనల్లో సమాజపు విలువలు శిథిలమై కన్నీరులొలుకుతున్నాయి.



నకరికల్లులో సోదరులను హత్య చేయించిన నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు (ఫైల్)

- మానవ సంబంధాలు అపహాస్యం
- పాశ్చాత్య విషసంస్కృతి విశృంఖలం
- వరుసకు అన్నాచెల్లెళ్ల వివాహం!
- చట్టవిరుద్ధమని తల్లిదండ్రుల ఫిర్యాదు
- అత్యాశకు పోయి సోదరులను మట్టుబెట్టిన మహిళ
- మంటగలుస్తున్న కుటుంబ విలువలు

నరసరావుపేటటౌన్: భారతదేశపు వివాహ వ్యవస్థ ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయం. సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు మన దేశం. ఇలాంటి గొప్ప సమాజపు విలువలు, ఆచారాలు, కట్టుబాట్లు, వివిధ మతాలు, కులాల మేలు కలయిక భారతీయ వ్యవస్థ. ఇలాంటి గొప్ప వ్యవస్థలోకి పాశ్చాత్య విషసంస్కృతి చాపకింద నీరులా ప్రవేశిస్తోంది. కోరలు చాచి బంధాలను చిదిమేస్తోంది. దీంతోపాటు సామాజిక మాధ్యమాల ప్రభావం నేటితరాన్ని వక్రమార్గం పట్టిస్తోంది. సోషల్ మీడియాలో మంచితోపాటు చెడు కూడా అదే స్థాయిలో వైరల్ కావడంతో యువత చెడుకు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా నైతికత కనుమరుగవుతోంది. కుటుంబ విలువలు పాతాళానికి పడిపోతున్నాయి.

పైసల కోసం పైశాచికం

నకరికల్లు మండలంలో ఇటీవల చోటుచేసుకున్న జంట హత్యల ఘటన కలకలం రేపింది. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు. కేసు వివరాలు పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. నకరికల్లు యానుదుల కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తలపాల పాలరాజు అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 4న మృతి చెందాడు. సొంత సోదరి తన సోదరులను ఆస్తి కోసం పథకం ప్రకారం మట్టుబెట్టింది. తన తమ్ముడు, అన్న చనిపోతే తండ్రి ద్వారా వచ్చే ఆస్తి, ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు మొత్తం తనకే వస్తుందని భావించింది. దీంతో తన ప్రియుడితో కలిసి సోదరులిద్దరినీ హత్య చేసింది. ఆస్తి కోసం పైశాచికానికి పాల్పడి చివరకు కటకటాల వెనక్కి వెళ్లింది.


సభ్య సమాజానికి తలవంపులు

నేటి సమాజంలో కనిపిస్తున్న విపరీత పోకడలు భావితరాన్ని వక్రమార్గం వైపు నడిపిస్తున్నాయి. అత్యాశ, హద్దులు లేని స్వేచ్ఛ నేటి సమాజంలో వేళ్లూనుకుపోయాయి. ఈ కారణంగా స్థోమతకు మించి జీవన విధానం సాగించాలనే భావన చెడు ప్రభావాలకు గురి చేస్తోంది. పై రెండు ఘటనలు కూడా ఈ కారణంగా సమాజానికి తలవంపులు తీసుకొస్తున్నాయి.

సోదర బంధానికి కళంకం

పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మండలంలో కొద్ది రోజుల క్రితం జరిగిన ఓ పెళ్లి హాట్ టాపిక్‌గా మారింది. వివాహ వ్యవస్థను అపహాస్యం చేస్తూ, పెద్దలను ఎదురించి చేసుకున్న ఈ ప్రేమ వివాహం ప్రతి ఒక్కరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. సోదర సమానులైన ఇద్దరు ప్రేమించుకున్నారు. తొలుత వీరు సోదరులని తెలియదు. అనంతరం పెళ్లి చేసుకుంటామని పెద్దలకు తెలియజేయగా.. తీరా ఆరా తీస్తే వీరిద్దరూ సోదర సమానులని తెలిసింది. ఇది సంప్రదాయం కాదని, ఇంతటితో వదిలేయాలని ప్రేమికులిద్దరికీ సర్ది చెప్పారు. కానీ వారు పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఉన్నత చదువులు అభ్యసించి ఉద్యోగాలు చేస్తున్న వారు కావడం గమనార్హం. ఈ వ్యవహారంపై అమ్మాయి తల్లిదండ్రులు నరసరావుపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మేజర్లమని ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకున్నామని ఇద్దరు బదులిచ్చారు. దీంతో తామేమి చేయలేమని పోలీసులు చేతులెత్తేశారు. దీనిపై చట్టవిరుద్ధంగా జరిగిన వివాహాన్ని రద్దు చేయాలని యువతి తల్లిదండ్రులు కోర్టు మెట్లెక్కారు.

విద్యార్థి దశ నుంచే విలువలు నేర్పాలి



పిల్లలకు విద్యార్థి దశ నుంచే సమాజపు కట్టుబాట్లు, సంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పిల్లల నడవడికను గమనిస్తుండాలి. గురువు పాత్రను విద్యార్థులకు వివరించి, సన్మార్గంలో నడిచేలా చూడాలి. పోలీసు శాఖ ఆధ్వర్యంలో కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నాం. గంజాయి, ర్యాగింగ్ వంటి విష సంస్కృతులకు దూరంగా ఉండాలని సూచిస్తున్నాం.

–కంచి శ్రీనివాసరావు, ఎస్పీ, పల్నాడు